క్లుప్తంగా

అలరించిన హాసం క్లబ్ కార్యక్రమాలు



ద్రోణంరాజు రాజేశ్వరిని సన్మానిస్తున్న హాసం క్లబ్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హాసం క్లబ్ ప్రతీ నెల 3వ ఆదివారం నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 19న స్థానిక రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా పలువురు సభ్యులు జోకులు చెప్పి సభ్యులను నవ్వించారు. మరికొందరు సభ్యులు పాటలు పాడి ఆకట్టుకున్నారు. అనంతరం నగరానికి చెందిన బ్రాహ్మణ సంఘం నాయకుడు ద్రోణంరాజు వెంకట రమణ మాతృమూర్తి ద్రోణంరాజు రాజేశ్వరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాలను హాసం క్లబ్ కన్వీనర్ జీఎస్ఆర్ శర్మ పర్యవేక్షించారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఇటీవల కురిసిన వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వర్షాల వల్ల పంటలపై తీవ్ర ప్రభావం పడిందని, ముఖ్యంగా జిల్లాలోని బుట్టాయగూడెం,జీలుగుమిల్లి, టి.నర్సాపురం, నూజివీడు,ఉంగుటూరు, కుకునూరు, వేలేరుపాడు ప్రాంతాల్లో భారీ వర్షాల వల్ల ఇబ్బంది ఏర్పడిందన్నారు. పిందె దశలో ఉన్న మామిడి, జీడి మామిడి పంటలు కూడా దెబ్బతిన్నాయన్నారు. అలాగువర్షం వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహ, కె.శ్రీనివాస్ ఓ ప్రకటన విడుదల చేశారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పీవీ రామకృష్ణ

ఏలూరు (టూటౌన్): చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఏప్రిల్ 5న నిర్వహిస్తున్నామని, వ్యవసాయ కార్మికులంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపు నిచ్చింది. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి పీవీ రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పటిష్టంగా అమలు చేయాలని, పేదలకు చెందిన భూములు వెంటనే ఇవ్వాలని కోరారు. జాన్‌రాజు, నాగేంద్ర, సునీలు, వినోద్, సుగుణరావు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ఉత్తమ సేవలు

నాడు " బర్త్, డెత్ సర్టిఫికెట్ కావాలంటే ... కార్యాలయాల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగుతూ ఉండేవారు. సామాన్య ప్రజలైతే కూలీ పనులు మానుకుని మరీ వారాల తరబడి తిరిగితే... ఆఖరికి టేబుల్ కింద చేయి తడిపితే కానీ సర్టిఫికెట్ రావటం కష్టంగా మారేది. పేదవర్గాల ప్రజలు ఉపాధి కోల్పోయి మరీ ఉదయం నుంచీ సాయంత్రం వరకూ కార్యాలయాల గేట్లు, తలుపులు పట్టుకుని వేలాడే దుస్థితి ఉండేది "

నేడు " పట్టణాలు, నగరాల్లో ఐతే ప్రతీ 4వేల ఇళ్లకు, గ్రామాల్లో ప్రతీ 2 వేల ఇళ్లకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇక ప్రతీ 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించారు. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను నెలకొల్పారు. ఉపాధి కోల్పోయి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నుంచీ ప్రభుత్వ పాలననే ఇంటి ముంగిటకు తీసుకువచ్చారు. పథకాలను ఆన్‌లైన్ చేయడం నుంచీ సమస్యల పరిష్కారం వరకూ, సర్టిఫికెట్ల జారీ, ఇతర ప్రజా సేవలను ఇంటి సమీపానికే చేర్చారు "

- సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక దృష్టి
- ఏలూరు నగరంలో 50మంది నోడల్ ఆఫీసర్లు



ఏలూరు శనివారపుపేటలోని గ్రామ సచివాలయం

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో 79 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో సుమారుగా 711 మందికి పైగా సచివాలయ సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతీ సచివాలయంలో 9 విభాగాల్లో ఉద్యోగులు తమ సేవలు అందిస్తున్నారు. వార్డు సచివాలయంలో అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీ, వార్డు ఎమినిటీస్ సెక్రటరీ, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు రెవెన్యూ సెక్రటరీ, వార్డు హెల్త్ సెక్రటరీ, మహిళా సంరక్షణ కార్యదర్శి పోస్టులు ఉన్నాయి. 500లకు పైగా సేవలు అందించాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకోగా, ప్రస్తుతానికి జనన, మరణాలు, పన్నుల చెల్లింపులు, కార్పొరేషన్ కార్యాలయంలోని సేవలన్నీ అందుబాటులో ఉన్నాయి. త్వరలో భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లు సైతం సచివాలయాల్లోనే చేపట్టేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుంది.

ఇంటి ముంగిటకే 'పాలన '

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమాని ప్రభుత్వ పాలన ఇంటిముంగిటమే చేరింది. ఏలూరు నగరంలోని 79 సచివాలయాల్లోని ఉద్యోగులు జాబ్‌చార్ట్ అమలు చేసేందుకు ప్రత్యేకంగా నగరంలో 50 మంది నోడల్ ఆఫీసర్లను నియమించారు. వీరంతా సచివాలయ ఉద్యోగుల పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కృషి చేస్తారు. ఇక కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో మరో కమిటీ నోడల్ ఆఫీసర్ల పనితీరును పరిశీలించేలా చర్యలు తీసుకున్నారు. ప్రతీ రోజూ సచివాలయ పరిధిలో ఉదయం 7 గంటల నుంచీ 9 గంటల వరకూ ఉద్యోగులు విభాగాల వారిగా డివిజన్‌లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకునేలా ప్రత్యేకంగా నూతన విధానాన్ని అమలు చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగి డివిజన్‌లో పర్యటిస్తూ ప్రజలకు స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుంటూ వాటిని స్పందన పోర్టల్‌లో పొందుపరుస్తూ వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంది. సంక్షేమ పథకాలు, శానిటేషన్, ఆరోగ్యం, శాంతిభద్రతలు ఇలా 9 విభాగాలకు సంబంధించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

స్కూళ్లలో క్లీన్ క్యాలెండర్



నగరపాలక సంస్థ పరిధిలో 113 పాఠశాలలు ఉండగా వాటిలో 75 స్కూళ్లలో క్లీన్ క్యాలెండర్ అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. పాఠశాలల్లో ఉదయం 8.45 గంటల నుంచీ 9గంటల వరకూ పరిసరాల పరిశుభ్రత, ఇతర అంశాలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. సచివాలయ శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సిబ్బంది స్కూళ్లకు వెళ్లి పరిసరాల పరిశుభ్రత, త్రిబుల్ ఆర్, వాటర్ కన్సర్వేషన్, పబ్లిక్ పార్టిసిపేట్, హెల్త్ తదితర అంశాలపై పిల్లలకు అవగాహన కల్పిస్తారు. పాఠశాల స్థాయి నుంచే సమాజం పట్ల అవగాహన, పర్యావరణ పరిరక్షణపై చైతన్యవంతులను చేసేందుకు ప్రత్యేకంగా కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తున్నాం.

– సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు నగర కమిషనర్

జాబ్ చార్ట్ పక్కాగా అమలు



సచివాలయం పరిధిలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జాబ్‌చార్ట్‌ను పక్కాగా అమలు చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన ప్రతీ పథకం, కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసేందుకు మా వంతు బాధ్యతలు నిర్వర్తిస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, ప్రజల ఆకాంక్షలకు తగినట్టు సచివాలయ ఉద్యోగులు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– తేరా రాజేష్, వార్డ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ

కాళ్లరిగేలా తిరిగాల్సిన పనిలేదు



ప్రజలకు ఏదైనా సర్టిఫికెట్ కావాలన్నా, వ్యక్తిగత పనులకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరుగుతూ ఉండేవారు. పైగా ఆయా కార్యాలయాల్లో డబ్బులు ఇస్తేగానీ పనులు చేసేవారు కాదు. కానీ నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అవినీతికి తావు లేకుండా ప్రజలకు సేవలు అందుతున్నాయి. లక్షల మందికి ఒకే ఒక్క కార్యాలయం ఉండే పరిస్థితుల నుంచీ ఇప్పుడు వాళ్ల ఇంటి సమీపంలోనే సచివాలయం ఏర్పాటు చేశారు. రూపాయి ఇవ్వాల్సిన పనిలేకుండా పథకాలన్నీ అర్హులకు అందుతున్నాయి.

– యల్లాపు మోజెస్, ఏలూరు వన్‌టౌన్

నూకాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



విశేష అలంకరణలో శ్రీ నూకాలమ్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేటలో వేంచేసియున్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఆదివారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి తరలివచ్చి అమ్మవారికి చద్ది నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జనపరెడ్డి కనక రాజేశ్వరి కృష్ణ, పొలిమేర దాసు, ఆలయ ప్రతినిధులు నక్క నాగేశ్వర రావు, గొంతిన సర్వేశ్వర రావు,గొంతిన రామకృష్ణ, వలపుల నూకరాజు, నీరుకొండ అప్పారావు తదితరులు భక్తులకు సౌకర్యాలు కల్పించి అమ్మవారి దర్శనం ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు మంత్రవాది రామకృష్ణ విశేష పూజలు నిర్వహించగా, కార్యనిర్వహణాధికారి ఆంధ్ర రవి శంకర్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని లక్కవరం శివారులో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు చేపట్టారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం అందుకున్న ఎస్సై దుర్గా మహేశ్వర రావు తన సిబ్బందితో దాడులు చేపట్టారు. 8 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ:1530 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

నలుగురు జూదరుల అరెస్ట్

టి.నరసాపురం : మండలంలోని సీతంపేటలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,300 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

విద్యార్థులకు క్యారియర్ల పంపిణీ



విద్యార్థులకు క్యారియర్ బాక్స్‌లు అందిస్తున్న తోట ఎడ్వర్డ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజంలో సాటి ప్రజల అవసరాలకు ఉపయోగపడుతూ వారికి సేవలందించడం ద్వారా ప్రతీ ఒక్కరూ భగవంతునికి చేరువకావ్చని యాంటీనోరీ సోషల్ సర్వీస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తోట ఎడ్వర్డ్ తెలిపారు. ఆదివారం స్థానిక బీడీ కాలనీలోని సెయింట్ ఆంటోనీ స్కూల్ ప్రాంగణంలో సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. తపస్సుకాల దీక్షలను పురస్కరించుకుని పేదలకు తమ సొసైటీ ద్వారా సామాజిక బాధ్యతగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించామన్నారు. పేద విద్యార్థులు అనేక మందికి వివిధ అవసరాల నిమిత్తం క్యారియర్లు పంపిణీ చేశామన్నారు. ఇప్పటికే తమ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నామని, ఇటీవలే పేదల కోసం భారీ స్థాయిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వందలాది మంది పేదలకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని మరింతమంది సేవామార్గంలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాంటీనోరీ సొసైటీ ప్రతినిధులు వీరవల్లి కీర్తన, జి. సత్యవతి, సీహెచ్. సుందర రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కేఎం రన్‌లో పాల్గొన్న మహిళలు



పలు విభాగాల్లో విజయం సాధించిన మహిళలు

ఏలూరు రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎఎస్ఆర్ స్టేడియం మహిళ వాకర్స్ ప్రసిడెంట్ టి.మేరీమాణిక్యం అన్నారు. ప్రపంచ మహిళ దినోత్సవం నేపథ్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆదివారం ఏలూరు సాయ్ ట్రెనింగ్ సెంటర్ మహిళలకు పోటీలు నిర్వహించింది. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో చేపట్టిన ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో సత్తా చాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవానికి రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి బడేటి వెంకట్రామయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం మహిళలు విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించడంతో దేశం అభివృద్ధి బాట పట్టిందన్నారు. కొన్నేళ్లుగా వ్యాపార, క్రీడ రంగాల్లో సైతం రాణిస్తుండడం సంతోషం కలిగిస్తుందన్నారు. కుటుంబాన్ని నడిపించే మహిళ అన్ని రంగాల్లో రాణిస్తే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ మహిళలను ప్రోత్సహించాలని సూచించారు. సాయ్ సెంటర్ ఇన్‌చార్జి డీఎస్వీ వినాయక్ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌పవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ త్రో అంశంలో క్రీడల్లో మహిళలకు ప్రోత్సాహం అందించాలని సాయ్ ఆదేశాల మేరకు వయస్సు వారీగా పోటీలు చేపట్టామన్నారు. ప్రతిభ చాటిన వారికి పతకాలతో పాటు బహుమతులు అందించామన్నారు. శిక్షకులు ఉదయ్‌సందీప్, శ్రీనివాస్, సీతాభవాని పాల్గొన్నారు.

విజేతలు వీరే

- 45 ఏళ్ల వయస్సులోపు విభాగంలో షాట్‌పుట్‌త్రో అంశంలో టి.మేరీమాణిక్యం, కె.అరుణ, కె సూర్య కుమారి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.
- 1 కిలో మీటర్ పరుగుపందెంలో ప్రథమస్థానంలో రామసత్యవతి, ద్వితీయ స్థానంలో కె.శోభా రాణి, తృతీయస్థానంలో బిందు నిలిచారు.
- వెయిట్‌లిఫ్టింగ్ డెడ్‌లిఫ్ట్ అంశంలో టి.మేరీమాణిక్యం, కె.అరుణ, టి.బాలప్రసన్న వరుస స్థానంలో విజయం సాధించారు. వీరితో పాటు ఎ.మౌనిక, పి.గౌతమి, వి.సాయిలక్ష్మీ సత్తా చాటారు.
- 45 ఏళ్ల వయస్సు పైబడిన వారిలో షాట్‌పుట్‌త్రోలో ఎంఎస్ బిందు, ఎస్.విజయ, రమా సత్యవతి విజయం సాధించగా, కిలోమీటర్ పరుగులో టి.బాలప్రసన్న, కె.అరుణ, టి.మేరీమాణిక్యం, డెడ్‌లిఫ్ట్ అంశంలో కె.శోభారాణి, కె.సూర్యకుమారి, ఎంఎస్ బిందు వరుస స్థానంలో విజయం సాధించి పతకాలు సొంతం చేసుకున్నారు. వీరితో పాటు పలువురు క్రీడాకారిణిలు సైతం పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి, మహిళల్లో స్ఫూర్తి నింపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	48–72
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	08–10
బెండకాయలు	44	కంద	46
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	34
కాకర కాయలు	34–40	కీరా దోస	36
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	50	అల్లం	100
క్యాబేజీ	20–25	కొత్తిమీర (కట్ట)	12
క్యారెట్	20	పాలకూర	10
దొండకాయలు	38	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30–36	బజాజీ	76
ఆనపకాయ (1)	15–20	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	24–30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	31
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	027
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	34
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	32
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

ముందస్తు చర్యలతో తప్పిన ముప్పు

ఏలూరు(మెట్రో): అకాల వర్షంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న, మామిడి పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడటంతో ఉద్యానశాఖ, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ముందస్తు జాగ్రత్తలు తెలుపుతూ పొలంబాట పట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నాలుగు రోజులుగా ఒక మోస్తరు వర్షపాతం కురుస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పూతమీదున్న మామిడి పంటకు ఈ వర్షం ఇబ్బందులు కలుగజేయనుంది. దీంతో నష్టనివారణ చర్యలు తీసుకునేందుకు ఉద్యాన శాఖాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా మొక్కజొన్న కల్లాల్లో ఉంటే వాటిని పరిరక్షించేందుకు వ్యవసాయ శాఖాధికారులు చర్యలు తీసుకుని ప్రస్తుతం మొక్కజొన్న పంట గింజ పట్టే దశ నుంచి కోత పట్టే దశకు ప్రవేశించిన నేపథ్యంలో మొక్కజొన్న కోతలను వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధానంగా ఏలూరు జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో 250 ఎకరాల్లో మొక్కజొన్న నేలకొరిగిన నేపథ్యంలో మిగతా పంటను సంరక్షించుకునే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఏలూరు జిల్లాలోనే మామిడి, మొక్కజొన్న పంటలు ఉన్న నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ, ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గేష్ ఆధ్వర్యంలో వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 62 మి.మి వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు. అత్యధికంగా మెట్ట ప్రాంతంలో టి.నరసాపురం మండలంలో 190 మి.మి వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. సోమవారం కూడా వాతావరణం ఇదే విధంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలుపుతున్నారు.

విద్యార్థుల ఘటనపై ఎస్పీ విచారణ

జంగారెడ్డిగూడెం: జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన ఘటనపై ఆదివారం జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ విచారించారు. స్థానిక అటవీశాఖ గెస్ట్ హౌస్‌లో విచారణ నిర్వహించారు. ముగ్గురు విద్యార్థులను, వారి తల్లితండ్రులను, ఉపాధ్యాయులు, హెచ్ఎంలను విడివిడిగా విచారించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ ఘటనపై విచారణలో తేలిన అంశాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. 18 సంవత్సరాల లోపు చిన్నారులను స్టేషన్‌కు తీసుకురావడం తదితర అంశాలపై సిబ్బంది దిశా నిర్దేశం చేస్తామన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



పేదలకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేత్ర వ్యాధులతో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు సూచించారు. ఆదివారం స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల, ఉష గ్రూప్ సంస్థల అధినేత వీవీ బాలకృష్ణారావు సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 152 మంది పేదలకు ఉచిత పరీక్షలు నిర్వహించి వారిలో 21 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. అలాగే 33 మందికి కళ్లజోళ్ళు ఉచితంగా పంపిణీ చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీవీ బాలకృష్ణారావు, చెన్న వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్గ విభేదాలకు దూరం

ఏలూరు రూరల్: మండలంలోని కొల్లేరు గ్రామం ప్రత్తికోళ్లలంక ప్రజలు ఒక్కటయ్యారు. 10 ఏళ్ల వర్గబేధాలకు ఫుల్‌స్టాప్ పెట్టి, కలిసి మెలిసి జీవించాలని నిర్ణయించారు. కట్టుబాట్ల ప్రకారం బంటాలుగా చేపలు సాగుతో ముందుకు సాగాలని భావిస్తున్నారు. శనివారం సర్పంచ్ ఘంటసాల మహలక్ష్మీరాజు, వైస్ ఎంపీపీ బలే సత్యప్రసాద్‌తో పాటు రెండువర్గాల పెద్దలు స్థానిక ప్రజాప్రతినిధి కొఠారు రామచంద్రరావును కలిశారు. ఊరంతా ఒక్కటయ్యామని, గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. 2013లో గ్రామంలో ఘర్షణలు తలెత్తాయి. ఎన్నికలు, ఊరు డబ్బు లెక్కింపులో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పెట్టిన చిచ్చు కారణంగా 5 వేల మంది గ్రామ ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయారు. అప్పటి నుంచి ఇబ్బందులు పడుతున్న ఇరు వర్గాల ప్రజలు 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడంతో వర్గబేధాలు లేకుండా అధికారులు సంక్షేమ పథకాలు అమలు చేసి, గ్రామంలో అభివృద్ధి పనులు చేశారు. ఫలితంగా పెద్దలు, ప్రజలు భేదాలు మరిచారు. స్థానిక రామాలయం, కొల్లేరు మల్లన్న దేవాలయాల్లో నిత్యపూజలు జరపాలని నిర్ణయించారు.

వారసత్వ సంపదను కాపాడేందుకు కృషి

ఏలూరు (టూటౌన్): దేశ వారసత్వ సంపదను కాపాడేందుకు తపన ఫౌండేషన కృషి చేస్తుందని సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి చెప్పారు. స్థానిక సంస్థ కార్యాలయం నందు ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగాది రోజున తపన ఫౌండేషన్ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సమాజంలో వారి వృత్తి వారు చేస్తూ సామాజిక సేవలు చేస్తున్న వ్యక్తులను ప్రత్యేకంగా సత్కరించనున్నట్లు తెలిపారు.



సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఏలూరు

99122 20559
95055 08399
96408 32693

Office mail : tpgadvt@gmail.com